క్లుప్తంగా

రాజన్న సేవలో మహారాష్ట్ర రవాణాశాఖ కమిషనర్



ప్రసాదం అందజేస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి

వేములవాడ: వేములవాడ రాజన్నను మహారాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ భీమనవర్ కుటుంబ సభ్యులతో ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. స్వామివారి దర్శన అనంతరం నాగిరెడ్డి మండపంలో వేదోక్త ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్, ఆలయ ఏఈవో రమేశ్‌బాబు, పర్యవేక్షకులు రాజన్ బాబు, తిరుపతిరావు పాల్గొన్నారు.

నేడు అద్దాల మండపంలో మహా లింగార్చన

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో మూడో సోమవారం సందర్భంగా మహాలింగార్చన కార్యక్రమాన్ని అద్దాల మండపంలోనే నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న కృష్ణాష్టమి ఉన్నందున అద్దాలమండపంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించనుండగా, మహాలింగార్చన కార్యక్రమాన్ని బీమేశ్వర ఆలయంలో నిర్వహిస్తారని ప్రకటించారు. ఈ మార్పును భక్తులు గమనించాలని కోరారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

వేములవాడ: పట్టణంలోని సుభాష్‌నగర్ రావిచెట్టు వద్ద రూ.15 లక్షలతో జంక్షన్ అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్‌తో కలిసి ఆదివారం భూమిపూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌పోస్టర్ ఆవిష్కరణ



సిరిసిల్ల ఎడ్యుకేషన్: మధ్యంతరంగా ఆగిన విద్యను కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్ అవకాశం కల్పిస్తుందని, దూర విద్యా విధానంలో కొనసాగే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్ ఏఐ కోఆర్డినేటర్ మహేశ్ మాట్లాడుతూ పదో తరగతితో పాటు ఇంటర్మీడియట్ మధ్యలో చదువు మానేసిన వారికి ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఇంటర్మీడియట్‌లో చేరేందుకు పదో తరగతి చదివి 15 ఏళ్లు నిండినవారు అర్హులన్నారు. ఈ నెలాఖరు వరకు ప్రవేశాలకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు 92480 20207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విప్‌ను కలిసిన పశువైద్యాధికారి

వేములవాడరూరల్: వేములవాడ పశువైద్యాధికారిగా బదిలీపై వచ్చిన అభిలాష్ ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రశాంత్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అభిలాష్ వచ్చారు. వేములవాడ, వేములవాడరూరల్, అర్బన్ మండలాలకు విధులు నిర్వహించనున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామానికి చెందిన బండి లక్ష్మికి ఆదివారం రూ.32,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, గ్రామ అధ్యక్షుడు ఆసాని మహిపాల్ రెడ్డి, జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, బుస్స లింగం తదితరులు పాల్గొన్నారు.

చేతన్‌కు అభినందన



చేతన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన రాపల్లి సాయి చేతన్‌కు నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ప్రభుత్వ ఉద్యోగం రావడంపై అఖిల భారత బంజారా సంఘం నాయకులు ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బంజారా సంఘం నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీరా రాజునాయక్, మండల అధ్యక్షుడు అజ్మీరా దేవిలాల్, మాజీ సర్పంచులు ప్రభునాయక్, పుణ్యానాయక్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కల్యాణ్ నాయక్, లింగంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న చండీమాత



చండీయాగంలో పద్మశాలీ సంఘం పెద్దలు

అమ్మవారిని కొలుస్తూ..

- కార్మిక క్షేత్రంలో ధార్మిక చింతన
- సుభిక్షం.. దైవకార్య సిద్ధికి కార్యక్రమం
- పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ
- ముగిసిన మహా చండీయాగం

సిరిసిల్లటౌన్: లోక కల్యాణార్థం.. నాలుగు రోజులుగా సిరిసిల్ల పట్టణంలో నిర్వహిస్తున్న 'మహా చండీయాగం' ఆదివారం ముగిసింది. పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్మికక్షేత్రంలో ఉదయం మొదలు రాత్రి వరకు దేవతారాధనలతో శాస్త్రోక్తంగా అందరికీ మంచి జరగాలని మహా చండీయాగం నిర్వహించారు.

సిరిసిల్లటౌన్: పవిత్ర శ్రావణ మాసంలో మానవులు భక్తి చింతనతో మెదలాలని పెద్దలు చెబుతున్నారు. అందుకే ఈ నెలలో భక్తి కార్యక్రమాలు ఎక్కువగా చేసి దైవానుగ్రహం పొందొచ్చని తరతరాలుగా ఈ మాసంలో పవిత్ర కార్యాలు, యాగాలు, మహా క్రతువులు నిర్వహిస్తారు. ఈక్రమంలోనే సిరిసిల్లలో కొద్ది రోజులుగా నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నుంచి బయటపడాలన్న తలంపుతో శ్రీశివభక్త మార్కండేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీమహా చండీయాగం చేయాలని నిశ్చయించారు. జిల్లాలో వర్షాలు పడి ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుంచి గట్టెక్కి నేత కార్మికులకు నిరంతర పనులు దొరకాలని, వివిధ కారణాలతో ఆలస్యమవుతున్న శ్రీమార్కండేయస్వామి ఆలయం పనులు వేగం కావాలని కోరుతూ మహత్కార్యాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలోనే సిరిసిల్లలో ఈనెల 15 నుంచి 18 వరకు నాలుగు రోజులపాటు శ్రీమహా చండీయాగాన్ని నిర్వహించారు.

పూర్ణాహుతితో ముగింపు

చండీ మహాయాగం నాలుగో రోజు పూర్ణాహుతితో మహాక్రతువు ముగిసింది. గణపతి పూజ, అంకురారోపణం, చండీ పరదేవత శోభాయాత్ర, గోపూజ, రుత్విగరణం, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మహా లింగార్చన, కుంకుమార్చనలు, స్థాపిత దేవతార్చనలు, వేద పారాయణాలు జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి చండీ యాగారంభం, మహాపూర్ణాహుతి విశేషార్చనలు, మహాత్ముల అనుగ్ర భాషణం, సుమంగళి కన్యకల పూజ, పండిత సన్మానం, మహాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిరిసిల్ల పద్మశాలీ సంఘం ప్రముఖులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమకు శుభం కలగాలి



వస్త్రోత్పత్తి రంగంలో దశాబ్దాలుగా పేరున్న సిరిసిల్లలో సంక్షోభంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పద్మశాలీ ఆరాధ్య దైవం మార్కండేయ ఆలయ నిర్మాణం కూడా వివిధ కారణాలతో ఆలస్యమవుతోంది. పట్టణ ప్రజల సంక్షేమం కోరుతూ వేదోత్తముల సూచనతో చండీయాగం జరిగింది.

– మండల సత్యం, పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి

యాగాలతో సుభిక్షం



పూర్వం రాజులు దుర్భిక్షం నెలకొన్న పరిస్థితుల్లో యజ్ఞయాగాలు జరిపేవారు. శాస్త్ర ప్రమాణంగా హోమ ద్రవ్యాలను సరైన పద్ధతిలో అగ్నికి ఆహుతిచ్చినప్పుడు అవి నేరుగా సూర్యుడికి చేరి వర్షాలు పడి రాజ్యానికి సుభిక్షం కలుగుతుంది. ప్రజలంతా సుఖసంతోషాలను పొందడమే చండీయాగం ప్రధాన ఉద్దేశం.

– వాసాల మనోహర్, యాజ్ఞికులు

లోక కల్యాణార్థం..



పట్టణంలో స్తంభించిన ప్రజా సంక్షేమం.. దైవకార్యం నిరాటంకంగా సాగాలనేది ముఖ్య ఉద్దేశం. పట్టణ, కుల పెద్దలు అందరూ సహకరిస్తున్నారు. ప్రస్తుతం సిరిసిల్లలో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయి. లోక కల్యాణం కాంక్షిస్తూ జగన్మాత చండీదేవికి యాగం నిర్వహించాం.

– గోలి వెంకటరమణ, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు



వేములవాడ: పాపన్న విగ్రహానికి నివాళులర్పించిన ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, నాయకులు

పాపన్నకు ఘన నివాళి



వేములవాడ రూరల్: మర్రిపల్లిలో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో గౌడ కుల సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

మహిళలకు రక్షణ కల్పించాలి



వేములవాడ: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వేములవాడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్సై రమేశ్, పోలీస్ సిబ్బందికి ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ నాయకులు రాఖీ కట్టారు. మహిళలు, విద్యార్థినులకు, రక్షణ కల్పించాలని వారు కోరారు. అనంతరం సీఐ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సామల్ల సాయిభరత్, కడారి శివ, గర్ల్స్ కమిటీ నాయకులు రుచిత, లాస్య, వర్షిత, చైత్ర తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన టీఆర్టీఎఫ్ నాయకులు



కోనరావుపేట: కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా ఎన్నుకొని సముచిత గౌరవం కల్పించారని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన కోదండరామ్‌ను రాష్ట్ర ప్రధానకార్యదర్శులు కటకం రమేశ్, మారెడ్డి అంజిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కోదండరామ్ నేతృత్వంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. పూర్వ అధ్యక్షుడు అశోక్‌కుమార్, టీఆర్టీఎఫ్ నాయకులున్నారు.

రిజర్వేషన్ల తీర్పుపై నిరసన



గంభీరావుపేట: నిరసన తెలుపుతున్న నాయకులు

గంభీరావుపేట: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మాల మహానాడు నాయకులు మండలకేంద్రంలో నిరసన తెలిపారు. తీర్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన తీర్పును నిరసిస్తూ ఈనెల 21న దేశవ్యాప్త భారత్ బంద్ నిర్వహించేందుకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చిందని, మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు తెలిపారు. జిల్లావ్యాప్తంగా వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దోసల శంకర్, రాంచంద్రం, బరిగెల బాబు, శ్రీకాంత్, చంద్రం, నర్సింలు పాల్గొన్నారు.

సిరిసిల్ల అర్బన్: ఎస్సీ వర్గీకరణ క్రీమీలేయర్ పేరుతో రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు మాట్లాడారన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఎస్సీలు అవకాశాలు కోల్పోతారని స్పష్టంచేశారు. బీజేపీ ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఈనెల 22న ఉదయం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తామని, మాలలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. గుంటి వేణు, సిరిగిరి రమేశ్, గొట్టె లింబయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

ముస్తాబాద్: మండల వ్యవసాయాధికారిగా సురేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ముస్తాబాద్ ఏవోగా ఏడేళ్లు పనిచేసిన వెంకటేశ్ కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇల్లంతకుంట ఏవోగా పనిచేస్తున్న సురేశ్‌కు ముస్తాబాద్ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

ఎల్లారెడ్డిపేట: మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా సిరిసిల్లలో ఏవోగా పనిచేస్తున్న సందీప్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న చాడ భూంరెడ్డి హుజూరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. సందీప్ సిరిసిల్ల ఫుల్‌చార్జ్‌తో పాటు ఎల్లారెడ్డిపేట మండలం, వీర్నపల్లి మండలాల ఇన్‌చార్జి ఏవోగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

కొండ గొర్రెను చంపి కటకటాల్లోకి..



అరెస్టు చూపుతున్న ఫారెస్ట్ అధికారులు

సిరిసిల్ల క్రైం: గంభీరావుపేట మండలం కొత్తపల్లి శివారు ప్రాంతంలో కొండ గొర్రెను చంపిన సయ్యద్ షరీఫ్, సయ్యద్ యాకుబ్‌ను జిల్లా ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కొండ గొర్రె తల, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఫారెస్ట్ అధికారుల వివరాల ప్రకారం.. అడవిలో బండలు కొడుతున్న సమయంలో వారికి కొండ గొర్రె కనబడడంతో బండరాయితో కొట్టారు. దీంతో సొమ్మసిల్లి పడిపోగా కొన ప్రాణంతో ఉన్న దానిని కోసి ఇంటి వద్ద వండుకునేందుకు యత్నించారు. విశ్వసనీయ సమాచారం మేరకు డీఆర్‌వో అంజలి వారిని పట్టుకున్నారు. వారినుంచి కొండ గొర్రె తల, కాళ్లు, మాంసం అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆర్.కల్పనదేవి తెలిపారు.



గంభీరావుపేట: మండలకేంద్రంలోని బరిగెలగూడెం కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగుకాలువలో చెత్తాచెదారంతోపాటు పిచ్చిమొక్కలు పెరిగాయి. మురుగునీరుతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – సందీప్, బరిగెల గూడెం, గంభీరావుపేట

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : సాయి, ఇన్‌చార్జి ఈవో, గంభీరావుపేట మేజర్ పంచాయతీ : 9182099814

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346626

'కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోకుండా కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించడం కాంగ్రెస్ నాయకులకే చెల్లిందన్నారు. కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని ప్రజలెవరు హర్షించరన్నారు. రుణమాఫీ చేయకుండా, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేటీఆర్ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారన్నారు. పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుమతి, నల్లనర్సయ్య, చెవుల మల్లేశ్, రమేశ్‌రెడ్డి, మనోహర్, స్వామి, నవాజ్, నర్సింలు, దిలిప్, బాలయ్య, సుధాకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	0	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	0	1,008
నందీశ్వర్ నాన్‌ఏసీ	0	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	0	448
పార్వతీపురం స్పెషల్	0	672
పార్వతీపురం సాధారణ	0	336

– వేములవాడ

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోనరావుపేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోనరావుపేట: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. పాఠశాలలోని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



సీసీరోడ్డు కోసం తవ్వి.. నిర్లక్ష్యంగా వదిలేసి

వీర్నపల్లి: మండలకేంద్రంలో సీసీరోడ్డు పనులకోసం కొన్ని రోజుల క్రితం రోడ్డును తవ్వారు. దీంతో మిషన్ భగీరథ పైపులు పగిలి రోడ్డంతా బురదమయంగా మారింది. ఈ రోడ్డుగుండా వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై పలుసార్లు కాంట్రాక్టర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

వేములవాడరూరల్: వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లికి చెందిన నడిగొట్ల రాజేశ్ కుమారుడు ప్రజ్వల్ ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడగా తలకు గాయాలయ్యాయి. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.